క్లుప్తంగా

అప్రమత్తంగా ఉండండి
డీసీపీ విశాల్‌గున్ని

విజయవాడ స్పోర్ట్స్: గుణదల మేరీ మాత ఉత్సవాల్లో నిత్యం అప్రమత్తతతో విధులు నిర్వహించాలని డెప్యూటీ పోలీస్ కమిషనర్(డీసీపీ) విశాల్‌గున్ని పోలీసులు అధికారులు, సిబ్బందికి సూచించారు. ఉత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో మేరీ మాత ఆలయం వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తును డీసీపీ శుక్రవారం పరిశీలించి సూచనలు చేశారు. శనివారం ఉత్సవాలు చివరి రోజు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉందన్నారు. రద్దీకి అనుగుణంగా బందోబస్తు ఏర్పాట్లు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చేయాలని ఆదేశించారు. సీసీ పుటేజీలను నిత్యం పరిశీలిస్తూ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. డీసీపీ వెంట ఏసీపీలు ఖాదర్‌బాషా, సుబ్బారావు, సీఐ గుణరాము ఉన్నారు.

ఆర్ఆర్ పేట నివాసితులకు న్యాయం చేస్తాం
జేసీ శ్రీవాస్ నుపూర్ అజయ్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాజరాజేశ్వరిపేటలోని రైల్వే స్థలంలో నివసిస్తున్న కుటుంబాలకు న్యాయం చేయడానికి చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ అజయ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. రాజరాజేశ్వరి పేట రైల్వే స్థల నివాసితులు, గన్నవరం నియోజకవర్గ పరిధిలోని పలు సమస్యలపై శుక్రవారం జాయింట్ కలెక్టర్ రైల్వే, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ 56 డివిజన్‌లోని రైల్వే స్థలంలో గత 40 సంవత్సరాలకు పైగా దాదాపు 800 కుటుంబాలు నివసిస్తున్నాయన్నారు. వీరికి ప్రత్యామ్నాయ స్థలాన్ని చూపడానికి నగరపాలక సంస్థ అధికారులు రైల్వే అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. గన్నవరం నియోజకవర్గ పరిధిలోని విజయవాడ రూరల్ మండలంలోని నున్న, రామవరప్పాడు, ప్రసాదంపాడు తదితర గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. నదీ జలాలను అందించడం, నున్న, రామవరప్పాడుల్లో రైతుబజార్ల ఏర్పాటు, ఇళ్ల స్థలాలను క్రమబద్ధీకరించడం తదితర సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. సమావేశంలో డీఆర్వో మోహన్‌కుమార్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ డి. దుర్గాప్రసాద్, తహసీల్దార్లు మాధురి, జాహ్నవి, రైల్వే అధికారులు ఉన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 31వ డివిజన్‌లో అభివృద్ధి పనులను శుక్రవారం కార్పొరేటర్ పెనుమత్స శిరీష పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్‌యూబీ వద్ద మరమ్మతులకు గురైన రోడ్డును ఎమ్మెల్యే మల్లాది విష్ణు సహకారంతో కొత్త రోడ్డును, పసుపుతోటలో రోడ్డు వేయించామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షులు పెనుమత్స సత్యం తదితరులు పాల్గొన్నారు.

అమర గాయకుల సంగీత సేవలు ఆదర్శం

విజయవాడ కల్చరల్: అమర గాయకుల సంగీత సేవలను ఆదర్శంగా తీసుకోవాలని శాతవాహన కళాశాల కరస్పాండెంట్ నిడుమోలు రమాసత్యనారాయణ అన్నారు. సురభి ఆర్కెస్ట్రా ఆధ్వర్యాన గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదికమీద శనివారం అమర గాయకుల స్ఫూర్తి సభ, తెలుగు హిందీ చిత్ర గీత నివాళి కార్యక్రమం నిర్వహించారు. రమా సత్యనారాయణ మాట్లాడుతూ ఘంటసాల, బాలు లాంటి గాయకులు తెలుగు సినిమాలకు లభించిన అమూల్య ఆభరణాలన్నారు. సురభి ఆర్కెస్ట్రా వ్యవస్థాపకుడు ఉమాశంకర్ కామినేని సంస్థ లక్ష్యాలను వివరించారు. కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు శింగంశెట్టి చంద్రశేఖర్ పరచూరి విజయలక్ష్మి, ప్రసూనా రామన్, వద్దాది కామేశ్వరి పాల్గొన్నారు. సీనియర్ గాయకుడు దండు చంద్రశేఖర్ ఆధ్వర్యాన మల్లాది స్వాతి, రూపా సత్యశ్రీ తెలుగు, హిందీ చిత్ర గీతాలను ఆలపించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

పాయకాపురం(విజయవాడరూరల్): నున్న రూరల్ పోలీసులు శుక్రవారం అనుమానాస్పదస్థితిలో కోట చంద్రశేఖర్(50)మృతి చెందినట్టు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అనకాపల్లికి చెందిన మృతుడు కోట చంద్రశేఖర్ పాతపాడు శివారు అప్పారావు పేటలో నివసిస్తున్న కుమార్తె బండ్లమూడి స్వర్ణదీపిక ఇంటికి శుక్రవారం వచ్చాడు. మానసిక పరిస్థితి బాగోని చంద్రశేఖర్ వచ్చినప్పటి నుంచి పిచ్చిగా మాట్లాడటం, కూతురుతో గొడవ పడుతూనే ఉన్నాడు. అతన్ని ఆసుపత్రిలో చికిత్సకు తీసుకెళ్ళేందుకు కుమార్తె, అల్లుడు లింగారావు కలిసి చంద్రశేఖర్‌ను ఇంట్లో పెట్టి అంబులెన్స్‌కు ఫోను చేశారు. అంబులెన్స్ వచ్చిన తర్వాత తలుపు తీసేందుకు ప్రయత్నించగా, లోపలి గడియ పెట్టి ఉంది. గట్టిగా తలుపులు పగలగొట్టి చూడగా చంద్రశేఖర్ చున్నీతో ఉరివేసుకొని వేలాడుతున్నాడు. మృతుని కుమార్తె స్వర్ణదీపిక చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పదస్థితి కేసుగా నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి పంపించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పేదలకు వరం.. కల్యాణమస్తు, షాదీతోఫా



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, ఎమ్మెల్సీ రుహుల్లా, మేయర్ భాగ్యలక్ష్మి, కార్పొరేటర్ షాహీనాసుల్తానా



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే విష్ణు, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ, కిరణ్‌రాజు తదితరులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకాలు నిరుపేద వధూవరులకు గొప్ప వరమని పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా పథకాలకు దరఖాస్తు చేసుకున్న 4,536 మంది లబ్ధిదారులకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా రూ.38.18 కోట్ల ఆర్థిక సాయం అందించడాన్ని హర్షిస్తూ ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా కార్యాలయం ఎదుట ముస్లిం మైనార్టీల పెద్దలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఎమ్మెల్యే వెలంపల్లి మీడియాతో మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం పేదల వివాహాలకు ఆర్థిక సాయం చేస్తానని చెప్పి రాష్ట్రంలోని నిరుపేద వధూవరులను మోసం చేసిందన్నారు. జగనన్న అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ సహాయాన్ని రెట్టింపు చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, విభిన్న ప్రతిభావంతులు, భవన నిర్మాణ కార్మికులకు సైతం నేడు అందించడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా మాట్లాడుతూ పేదల కోసం తపించే వ్యక్తి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. కార్యక్రమంలో మేయర్ రాయన భాగ్యలక్ష్మి, 59వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ షాహీనాసుల్తానా, వైఎస్సార్ సీపీ నాయకులు ఎండీ హఫీజుల్లా, కొనకళ్ల విద్యాధరరావు, ఆదిరాల విజయ్‌కుమార్, కంభగళ్ల రాజు, ఎస్‌కే రెహ్మాన్, మున్నీ, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదల ఇళ్లల్లో కల్యాణ కాంతులు

వైఎస్సార్ కల్యాణ మస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకాలతో రాష్ట్రంలోని నిరుపేదల ఇళ్లల్లో కల్యాణ కాంతులు వెదజల్లుతున్నాయని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. ఈ పథకాల ద్వారా రాష్ట్రంలోని దివ్యాంగులకు రూ.1.50 వేలు ఆర్థిక సాయం అందించడాన్ని హర్షిస్తూ వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర అధ్యక్షులు బందెల కిరణ్‌రాజు ఆధ్వర్యంలో సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి 58వ డివిజన్ ఇందిరానాయక్‌నగర్‌లో శుక్రవారం క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, నేతలు శ్రీనివాసరెడ్డి, అఫ్రోజ్, కాళ్ల ఆదినారాయణ, తోపుల వరలక్ష్మి, మీసాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మరిన్ని మెరుగైన సేవలు

'మన సచివాలయం–మన ఎమ్మెల్యే'లో మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రజలకు మరిన్ని మెరుగైన సేవలు అందించాలని రోజూ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే మల్లాది విష్ణు సచివాలయ సిబ్బందికి సూచించారు. 31వ డివిజన్ ముత్యాలంపాడులో శుక్రవారం రచ్చబండ తరహాలో 'మన సచివాలయం - మన ఎమ్మెల్యే' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు గరిష్ఠ స్థాయిలో సంక్షేమాన్ని అందిస్తూ, అభివృద్ధి కార్యక్రమాలను పరుగులు పెట్టించటానికి మన సచివాలయం- మన ఎమ్మెల్యే కార్యక్రమం ప్రారంభించామని చెప్పారు. సచివాలయ పరిధిలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులతో సమావేశం కావడం.. పెండింగ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశయ సాధనకు వార్డు సచివాలయం ఉద్యోగులు పని చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సచివాలయ సిబ్బందితో ముఖాముఖి నిర్వహించారు. సంక్షేమ క్యాలెండర్‌పై ఎప్పటికప్పుడు లబ్ధిదారులకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ప్రజల నుంచి వచ్చిన అభ్యర్థనలతోడివిజన్లో అభివృద్ధి పనులు కూడా వేగవంతం చేసినట్లు మల్లాది విష్ణు తెలిపారు. శ్రీనగర్ కాలనీ, టీచర్స్ కాలనీలలో రూ.61.84 లక్షల నిధులతో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, యూజీడీ నిర్మాణ పనులు పూర్తి చేశామని చెప్పారు. జెండా చెట్టు వీధిలో రూ. 15.69 లక్షల వ్యయ అంచనాతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఇటీవల శంకుస్థాపన చేయగా.. పనులు వేగవంతంగా జరుగుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పెనుమత్స శిరీష, జోనల్ కమిషనర్ సృజన, వీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటా ఆనందం



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను వృద్ధుడికి అందజేస్తున్న ఎమ్మెల్యే విష్ణు, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలతో రాష్ట్రంలోని ప్రతి ఇంటిలో ఆనందాలు వెల్లువెత్తుతున్నాయని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 58వ డివిజన్ 241వ వార్డ్ సచివాలయంలో పరిధిలో నాలుగో రోజు చేపట్టిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం శుక్రవారం జరిగింది. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజతో కలిసి ఆయన ఇందిరానాయక్‌నగర్‌లో పర్యటించి స్థానిక ప్రజలతో మాట్లాడారు. 166 గడపలను సందర్శించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ అభ్యంతరం లేని ఆక్రమిత భూముల్లో 150 గజాలలోపు ప్రభుత్వమే ఉచితంగా రిజిస్ట్రేషన్లు చేయించేందుకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలపడం సంతోషంగా ఉందని, దీంతో నియోజకవర్గంలో 5 వేల కుటుంబాలకు లబ్ధి చేకూరనుందని, జీఓ విడుదలైన వెంటనే రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కూడా ప్రారంభమవుతుందని తెలిపారు. మూడు ప్రాంతాల సమగ్రాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, అమరావతితో పాటుగా ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలు కూడా బాగుండాలన్నదే వైఎస్సార్ సీపీ సర్కారు ప్రధాన ఉద్దేశమన్నారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఆదర్శపాలనను చూసి చంద్రబాబు ఓర్వలేకపోతున్నారని, ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేసి రాజకీయ లబ్ధి పొందాలని భావిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సీడీఓ జగదీశ్వరీ, నేతలు శ్రీనివాసరెడ్డి, రవికుమార్, అఫ్రోజ్, సునీత, వరలక్ష్మి, నేరెళ్ల శివప్రసాద్, షేక్ నాగుల్‌మీరా, అన్ని శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. స్వచ్ఛ విజయవాడలో భాగంగా 58వ డివిజన్‌లో 10 నూతన చెత్త సేకరణ ట్రాలీలను డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజతో కలిసి శుక్రవారం ఆయన ప్రారంభించారు. చెత్తను తడి, పొడి, హానికరమైన వ్యర్థాలుగా విభజించి పారిశుద్ధ్య కార్మికులకు అందించాలని ప్రజలకు సూచించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ వింజమూరి వందనం బాబు, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.


రూ.10 లక్షల విలువైన ఎల్‌ఓసీ అందజేత


అనారోగ్యంతో బాధపడుతున్న 23వ డివిజన్ సత్యనారాయణవీధికి చెందిన గోపి రమణ(54) అనే మహిళకు రూ.10 లక్షల విలువైన ఎల్‌ఓసీ పత్రాన్ని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు శుక్రవారం బాధితురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు.

గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్–2023 లోగో ఆవిష్కరణ

రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా మార్చి 3, 4 తేదీల్లో విశాఖపట్టణంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్–2023' లోగోను రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు శుక్రవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఎస్ఎస్‌సీసీఐ కోఆర్డినేటర్, డిస్ట్రిక్ట్ ఇండస్ట్రీస్ ప్రమోషన్ కమిటీ సభ్యులు ప్రభు వికాస్ తదితరులు పాల్గొన్నారు.

• కరుణించు.. మేరీమాత





కరుణించు మేరీమాత అంటూ విశ్వాసులు గుణదల కొండకు బారులు తీరి వచ్చారు. మేరీమాత తిరునాళ్లలో రెండో రోజు శుక్రవారం మరియమాతను దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. శిఖరాగ్రాన ఉన్న క్రీస్తు శిలువ వద్దకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తిరునాళ్లలో భాగంగా సమష్టి దివ్యబలిపూజ సమర్పించి భక్తులకు దివ్య సత్ప్రసాదాన్ని అందజేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



అనుమతి లేకుండా అదనపు లోడ్ వాడొద్దు

- విద్యుత్ శాఖ డీఈఈ సుధాకర్
- సింగ్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారుల ఆకస్మిక తనిఖీలు
- 159 కేసుల నమోదు... రూ.4.66 లక్షల జరిమానా



సమావేశంలో విద్యుత్‌శాఖ అధికారులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): విద్యుత్ శాఖ నుంచి అనుమతి లేకుండా అదనపు లోడ్ విద్యుత్ వాడకం చట్టరీత్యా నేరమని, లైన్‌మెన్లు, లైన్ ఇన్‌స్పెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్‌శాఖ విజయవాడ డివిజన్ ఈఈ బీవీ సుధాకర్ సూచించారు. సింగ్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని అధికారులు, లైన్‌మెన్‌లు, లైన్ ఇన్‌స్పెక్టర్లతో సింగ్‌నగర్ షాదీఖానాలో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. లైన్ల మీద పని చేసే సిబ్బంది అదనపు వాడకాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, అదనపు విద్యుత్ వాడకంతో చుట్టుపక్కల విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ సమస్యలు తలెత్తి అనేక సమస్యలకు కారణాలవుతాయన్నారు.

సింగ్‌నగర్‌లో 44 బృందాల ఆకస్మిక తనిఖీలు

విద్యుత్ శాఖ విజిలెన్స్, ఆపరేషన్ అధికారులు 44 బృందాలుగా ఏర్పడి సింగ్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. దాడుల్లో అధికంగా విద్యుత్ లోడ్‌ను వాడుతున్న వారిని గుర్తించి నోటీసులు జారీచేశారు. అదనపు విద్యుత్‌ను వాడుతున్న 159 వినియోగదారులపై కేసులు నమోదు చేసి వారికి రూ.4.66 లక్షల అపరాధ రుసుం విధించారు. విజిలెన్స్ ఏడీఈ బి.నవీన్ కుమార్, డీ4 ఇన్‌చార్జ్ ఏడీఈ కె.నాగసాయి, సింగ్‌నగర్ ఏఈ డి.కిరణ్‌కుమార్, విజిలెన్స్ ఏఈలు, టౌన్ డివిజన్ ఏడీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విష్ణు, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ, నాయకులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): మౌలిక వసతుల కల్పనపై వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 58వ డివిజన్‌లోని ఇందిరానాయక్‌నగర్, నందమూరినగర్ సిమెంట్ ఫ్యాక్టరీ రోడ్డు ప్రాంతాల్లో రూ.33.67 లక్షల వ్యయ అంచనాతో చేపట్టిన అభివృద్ధి పనులను డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ నగర శివారు ప్రాంతాల్లో కొత్తగా ఏర్పడుతున్న ఇందిరానాయక్‌నగర్, నందమూరినగర్, ఆంధ్రప్రభకాలనీల్లో వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి డివిజన్‌ను సమానంగా అభివృద్ధి చేసి చూపుతున్నామన్నారు. నేతలు అవుతు శ్రీనివాసరెడ్డి, ఉమ్మడి వెంకట్రావు, కాళ్ల ఆదినారాయణ, సామంతకూరి దుర్గారావు స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

పేదల చిరకాల కోరిక తీరుస్తున్న సీఎం జగన్

57వ డివిజన్ కార్పొరేటర్ ఇసరపు దేవి



స్థానిక సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ దేవి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): న్యూఆర్‌ఆర్‌పేటవాసుల చిరకాల కోరికను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీరుస్తున్నారని 57వ డివిజన్ కార్పొరేటర్ ఇసరపు దేవి అన్నారు. న్యూఆర్‌ఆర్‌పేటలో శుక్రవారం పర్యటించిన ఆమె స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ న్యూఆర్‌ఆర్‌పేట ప్రజల ఇళ్లకు రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పిస్తామని గత టీడీపీ పాలకులు డివిజన్‌లోని నిరుపేద ప్రజలను మోసం చేశారని, పేదల పక్షపాతిగా పేరొందిన మన జగనన్న పేద ప్రజల ఆశలను నిజం చేసి చూపారన్నారు. రెండు రోజుల క్రితమే కొన్ని ఇళ్లకు రిజిస్ట్రేషన్ చేయించామని, నామమాత్ర ఫీజులతో రిజిస్ట్రేషన్లు కల్పించిన జగనన్నకు, ఎమ్మెల్యే మల్లాది విషుకు డివిజన్ ప్రజలు రుణపడి ఉంటారన్నారు.

భరత్ టెస్ట్ అరంగేట్రంపై కేడీసీఏ సంబరాలు



కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుతున్న కేడీసీఏ ప్రతినిధులు

విజయవాడ స్పోర్ట్స్: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్(ఏసీఏ) క్రీడాకారుడు కోన శ్రీకర్ భరత్ భారత టెస్ట్ క్రికెట్‌లో అరంగేట్రం చేయడంపై కృష్ణాజిల్లా క్రికెట్ అసోసియేషన్(కేడీసీఏ) అడహాక్ కమిటీ ప్రతినిధులు సంబరాలు చేసుకున్నారు. విజయవాడలోని ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలోని క్రికెట్ నెట్స్ వద్ద క్రీడాకారుల సమక్షంలో అడహాక్ కమిటీ చైర్మన్ టి.త్రినాథరాజు కేక్ కట్ చేసి భరత్‌కు శుభాకాంక్షలు తెలిపారు. విశాఖపట్నంకు చెందిన భరత్ ఎంతో శ్రమించి ఆ స్థాయికి ఎదిగాడని సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో అడహాక్ కమిటీ కన్వీనర్ ఎం.రవిశంకర్, సభ్యులు ఐ.పెంచలయ్య, ఏసీఏ మాజీ కార్యదర్శి దుర్గాప్రసాద్, కేడీసీఏ మాజీ కార్యదర్శి వై.ఎల్లారావు పాల్గొన్నారు.

■ పుస్తక ప్రియుల సందడి



డిజిటల్ యుగంలో పుస్తకాలకు ఆదరణ లేదనే వాదనను కొట్టేస్తూ ముద్రాక్షరాలదే అగ్రస్థానమని పాలిటెక్నిక్ కాలేజీలోని పుస్తక మహోత్సవం చాటుతోంది. ఈ ప్రాంగణంలోని 220 స్టాళ్లలోని అనేక రకాల పుస్తకాలు.. పుస్తక ప్రియుల జ్ఞాన తృష్ణను, పఠన పిపాసను తీర్చడానికి కొలువుదీరాయి. శుక్రవారం పలు సదస్సులు, పుస్తకావిష్కరణలు తదితర కార్యక్రమాలు జరిగాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ 11కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్లకు మరమ్మతులు జరగనుండటంతో శనివారం ఉదయం 8 నుంచి 10గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.వి.సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకాష్‌నగర్, లక్ష్మీనగర్, ఎల్‌బీఎస్ నగర్, ఆంధ్రాబ్యాంక్ మెయిన్‌రోడ్డులో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు విద్యుత్ సబ్‌స్టేషన్ 11కేవీ అయోధ్యనగర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 8 నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అయోధ్యనగర్ రాఘవేంద్ర థియేటర్, రిలయన్స్‌మార్ట్, ఇందిరా ఎన్‌క్లేవ్, అయోధ్యనగర్ ఒకటో లైన్ నుంచి ఐదోలైన్ వరకు, బవసతారకనగర్, పలగాని ప్రభాకరరావు రోడ్డు, చింతచెట్టు బజార్, గట్టా రత్తయ్య వీధి, అయోధ్యనగర్ డొంక రోడ్డు, సాయిబాబా గుడి రోడ్డు, అగ్రిగోల్డ్ శివాలయం తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

16న సాయిబాబా విగ్రహావిష్కరణ

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ భగవాన్ శ్రీ షిర్డీ సాయిబాబా మందిరం లెండీవనంలో సాయిబాబా విగ్రహాన్ని ఈనెల 16వ తేదీ గురువారం ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆవిష్కరిస్తారని మందిర గౌరవాధ్యక్షురాలు పిల్లి లక్ష్మీతులసి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ప్రత్యేక పూజలు జరుగుతాయని పేర్కొన్నారు.

దేవీనగర్ రోడ్డులో పార్కింగ్ టైల్స్

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 30వ డివిజన్‌లో రూ.80లక్షల వ్యయ అంచనాతో విస్తరించిన రోడ్డుకు మార్జిన్లలో పార్కింగ్ టైల్స్‌ను వేశారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు రోడ్డును విస్తరించి పార్కింగ్ టైల్స్ వేస్తున్నామని ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు.

నేడు సిద్ధార్థ ఆడిటోరియంలో 'మన సంస్కృతి-మన కళలు'

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): స్థానిక సిద్ధార్థ ఆడిటోరియంలో శనివారం సాయంత్రం 5 నుంచి 8 గంటల వరకు మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో మన సంస్కృతి-మన కళలు పేరుతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ప్రపంచ తెలుగు సమాఖ్య విజయవాడ ప్రాంతీయ కమిటీ అధ్యక్షుడు పాలడుగు లక్ష్మణరావు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. రచయిత కల్లూరి భాస్కరానికి బీఎస్ఆర్ కృష్ణ స్మారక పురస్కార ప్రదానం చేయనున్నామని పేర్కొన్నారు. పురస్కార ప్రదానం తర్వాత కళారత్న, కేంద్ర సంగీత నాటక అకాడమీ సభ్యుడు డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి ఆధ్వర్యంలో నర్తనశాల (కూచిపూడి నృత్య రూపకం) ప్రదర్శన జరుగుతుందని వివరించారు.

రేపు దివ్య ఖురాన్ కంఠస్థ ఫైనల్ పోటీలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఈనెల 12వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటలకు ఆటోనగర్‌లోని ది ఆటోమొబైల్ టెక్నీషియన్స్ అసోసియేషన్ హాల్లో బాల బాలికలకు దివ్యఖురాన్ కంఠస్థ పోటీలు నిర్వహిస్తున్నట్లు యునైటెడ్ ఫోరమ్ ఫర్ ఖురానిక్ స్టడీస్ చైర్మన్ మొహమ్మద్ దావూద్ తెలిపారు. శుక్రవారం గాంధీనగర్ లోని ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో 3 నుంచి 12 సంవత్సరాల వయసున్న బాలబాలికలకు ఖురాన్ కంఠస్థ పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. సెమీ ఫైనల్స్‌లో ఎంపిక చేసిన మూడు గ్రూపులనుంచి ఒక్కో గ్రూపునకు ముగ్గురు చొప్పున ఫైనల్‌కు ఎంపిక చేసినట్లు చెప్పారు.

ఎయిమ్స్‌కు సిటీ సర్వీసును పునరుద్ధరించాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): గద్దె వెంకట్రామయ్యనగర్ నుంచి మంగళగిరి ఎయిమ్స్‌కు సిటీ బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరించాలని డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షులు వసంతకుమార్ శుక్రవారం ఆర్టీసీ అధికారులకు వినతి పత్రం అందజేశారు. మధురానగర్, గద్దె వెంకట్రామయ్య నగర్, దేవీనగర్ ప్రాంతం నుంచి ఎయిమ్స్‌కు సిటీ బస్సు లేకపోవడంతో ప్రజలు వ్యయప్రయాసలకు గురవుతున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. సుమారు రెండు నెలల క్రితం రోడ్డు పనులు జరుగుతున్న దృష్ట్యా బస్సు సర్వీసును నిలిపివేశారని పనులు పూర్తయ్యాయని సర్వీసును పునఃప్రారంభించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆటోనగర్‌కు ఏలూరు రోడ్డుమీదుగా డైరెక్టు బస్సును ఏర్పాటు చేయాలని కోరారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆర్టీసీ అధికారులు హామీ ఇచ్చారు.